# సైబర్ నేరస్తుడిని అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు



ఖమ్మం మే 17( ప్రజా కలం న్యూస్)

ఆన్లైన్ లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు కోటి రూపాయలు మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు ఆంధ్ర ప్రదేశ్ రాష్టశీ లోని వెస్ట్ గోదావరి జిల్లాలోని మొగల్తూరు లో అరెస్టు చేసినట్లు ఖమ్మం సి.పి. సునిల్ దత్, తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగిని కి యూట్యూబ్ ప్రకటన ల ద్వారా వాట్సాప్ గ్రూప్ ల లో పరిచయం అయి ఆన్లైన్ లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్, ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 13 లక్షలు రూపాయలు ఖాతాలో ఇన్వెస్ట్మెంట్ చెయిన్చి మోసపోయిన కేసులో గాను, వివిధ కేసులలో నిందితుడు గా ఉన్న అక్కౌంట్ హోల్డర్ అయిన కడలి చంద్ర శేఖర్ , వయస్సు 23 సం: లు ను వెస్ట్ గోదావరి జిల్లాలోని మొగల్తూరు లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డి. ఎస్పీ, సిహెచ్ .. ఆర్.వి . ఫణిందర్,ని అట్టి టాస్క్ లో పాల్గొన్న ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భూక్యా రవి కుమార్ , ఎస్సై లు రశీజిత్ కుమార్ , విజయకుమార్ లను,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస రావు ,కానిస్టేబుల్ భాను మూర్తి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బం దిని ఖమ్మం సి పి . శ్రీ, సునీల్ దత్, ఐపిఎస్ అభినందించారు.

# ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

### - గిరిజన సంక్షేమం డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి

### - అర్హత, ఆసక్తిగల నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు మే 21 లోగా దరఖాస్తులు సమర్పించాలి

ఖమ్మం మే 17( ప్రజా కలం న్యూస్ )

సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ, భద్రాచలం ఆధ్వర్యంలో 2 నుండి 4 నెలల పాటు వివిధ కోర్సులలో ఉచిత నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు, ఇట్టి అవకాశాన్ని ఖమ్మం జిల్లా పరిధిలో గల నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలనీ గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.టైలరింగ్, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్, బ్యూటీ తెరపిస్ట్, సిఆర్ఎం డొమెస్టిక్ నాన్ వాయిస్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ మేకప్ ఆర్టిస్ట్ కోర్సులను భద్రాచలంలోనీ గిరిజన భవన్ ప్రక్కన ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ అందించనున్నట్లు, టైలరింగ్ కోర్సు కు 9వ తరగతి ఆపైన అర్హత, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్ కొరకు ఇంటర్మీడియట్, మిగతా కోర్సులకు ఎస్సెసి అర్హత ఉండాలని తెలిపారు. అలాగే గెస్ట్ సర్వీస్ అసోసియేట్, గోట్/షీప్ ఫార్మర్, వేర్హౌస్ అసోసియేట్, మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్ కోర్సులను ఇల్లందు సుదిమల్ల యూత్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ అందించ నున్నట్లు, గోట్/షీప్ ఫార్మర్ కొరకు 8వ తరగతి ఆపైన అర్హత, మిగతా కోర్సులకు ఎస్సెసి అర్హత ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్, స్టడీ మెటీరియల్, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందించబడు తుందని, అర్హత గల 18 నుండి 35 సంవత్సరాలు గల గిరిజన యువతీ, యువకులు ఆధార్, కులం, పాస్ ఫోటో, స్టడీ పత్రాలతో కలెక్టరేట్ లోని గిరిజన సంక్షేమ కార్యాలయం (ఎస్ 30)లో మే 21 లోగా తమ దరఖాస్తును సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆ ప్రకటనలో తెలిపారు.

# జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు - డిఆర్డిఓ శ్రీరామ్

### - జాబ్ కార్డు కలిగి ఈ కేవైసీ నమోదు చేసుకున్న వారికి అవకాశం

ఖమ్మం మే 17( ప్రజా కలం న్యూస్) జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించే అవకాశం ఉన్నందున, జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నందు జాబ్ కార్డు కలిగి ఈ కేవైసీ ప్రక్రియ నమోదు చేసుకున్న వారికి పనులు కల్పిస్తున్నట్లు ఇట్టి అవకాశాన్ని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కే.శ్రీరామ్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం 63 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని, మే 16న పెండింగ్ లో ఉన్న కూలీల వేతనాలు 16.76 కోట్లు విడుదల అయినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తూ ఉద్యానవన పంటల సాగు క్రింద మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, వెదురు, జీడిమామిడి, మునగ, కొబ్బరి, శీతాకాలం వంటి తోటల పెంపకానికి ప్రోత్సహించి రైతులకు శాశ్వత ఆదాయ వనరులను కల్పించడం జరుగుతుందని, 5 ఎకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులనీ, జాబ్ కార్డు కలిగిన ప్రతి రైతు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మండల కార్యాలయంలోని ప్రోగ్రాం అధికారి, అదనపు ప్రోగ్రామ్ అధికారిని సంప్రదించాలని డిఆర్డిఓ కే.శ్రీ రామ్ తెలిపారు.

# హరీష్ పార్టీకి దూరమౌతున్నారా...

మెదక్ : హరీష్ రావు తాను అమెరికా వెళ్తున్నట్లుగా ప్రకటించారు. కొన్నాళ్లు అక్కడే ఉంటానని కూడా సోషల్ మీడియాలో తెలిపారు. ఎన్నాళ్లన్నది చెప్పలేదు. ప్రస్తుతం బీఆర్ఎస్లో జరుగుతున్న పరిణామాలతో సహజంగానే హరీష్ రావు అమెరికా పర్యటన బీఆర్ఎస్లో అంతర్గతంగా కలకలం రేపుతోంది. గతంలో కవిత కూడా అలా అమెరికా పోయినప్పుడు ఇక్కడ చాలా జరిగాయి. ఆమె వచ్చే సరికి.. ఆమెకు, పార్టీకి మధ్య పూడ్చలేనంత గ్యాప్ వచ్చింది. చివరికి అది సొంత పార్టీ ప్రకటనకు దారి తీసింది. కొద్ది రోజులుగా బీఆర్ఎస్ పార్టీలో కేటీఆర్ వర్గానికి, హరీష్ రావు వర్గానికి మధ్య కోల్డ్ వార్ నడుస్తోందనే వార్తలు వెబ్ మీడియాలో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పార్టీ పగ్గాల విషయంలో గానీ, భవిష్యత్తు కార్యాచరణలో గానీ హరీష్ రావును పక్కన పెడుతున్నారనే అసంతృప్తి ఆయన అనుచరుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. హరీష్ రావు రాజకీయాలు భిన్నంగా ఉంటాయి. బండి సంజయ్ కుమారుడి కేసును బీఆర్ఎస్ సీరియస్ గా రాజకీయం చేస్తే హరీష్ రావు మాత్రం ఏమీ మాట్లాడలేదు. సరిగ్గా ఇటువంటి కీలక సమయంలో హరీష్ రావు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండి అమెరికా వెళ్లడం, ఆయన మౌన ముద్ర వేయబోతున్నారా? లేక పార్టీ వ్యవహారాల నుంచి కొద్దిరోజులు విరామం కోరుకుంటున్నారా? అన్న సందేహాలు పార్టీ క్యాడర్కు వస్తున్నాయి.హరీష్ రావు పార్టీలో అంత కంఫర్టబుల్ గా లేరని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ఇటీవలి పరిణామాలు అందుకు సాక్ష్యంగా కనిపిస్తున్నాయి. కుమారుడి చదువు అనేది వ్యక్తిగత విషయమైనప్పటికీ, రాజకీయాల్లో టైమింగ్ ముఖ్యం కాబట్టి, ఆయన పర్యటన వెనుక రాజకీయ వ్యూహం కూడా ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆయన కొంత అసంతృప్తితో ఉన్నారని, అందుకే ఈ విదేశీ పర్యటనను ఒక సాకుగా తీసుకున్నారని ప్రత్యర్థి వర్గాలు ప్రచారం చేస్తున్నాయి.

## ఆత్మీయ కలయికతో

# విరిసిన ఆనంద వెల్లువ

### - ఇరవై ఐదేళ్ల తర్వాత ఒక్కటైన 2000-2001 బ్యాచ్ మిత్రులు

### - మధుర జ్ఞాపకాలతో కన్నీటి తడిసిన గురుశిష్య బంధం

మే 17 ప్రజాకాలం ప్రతినిధి: (వరంగల్ / వర్ధన్నపేట)

కాలం ఎంత దూరం చేసినా... పాఠశాల జ్ఞాపకాలు, గురువుల అనుబంధం మాత్రం ఎన్నటికీ చెదరని అనుబంధమని మరోసారి నిరూపితమైంది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 2000-2001 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం భావోద్వేగ క్షణాలకు వేదికైంది. దాదాపు ఇరవై ఐదు సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న ఆనాటి సహపాఠులు చిన్ననాటి మధురస్మృతులను నెమరువేసు కుంటూ ఆనందంలో మునిగిపోయారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ స్థిరపడిన విద్యార్థులు కుటుంబ సభ్యులతో హాజరై ఆత్మీయంగా పలకరించుకున్నారు.ఈ సందర్భంగా అప్పట్లో తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. గురువులను చూసిన వెంటనే పలువురు విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. "ఈ రోజు మేము ఉన్నత స్థాయిలో ఉన్నామంటే దానికి కారణం మీరు అందించిన విద్య, క్రమశిక్షణే" అంటూ ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించడం అక్కడి వాతావరణాన్ని మరింత హృద్యంగా మార్చింది. విద్యార్థుల ప్రేమాభిమానాలకు ఉపాధ్యాయులు సైతం కన్నీటి పర్యంతమయ్యారు. పాఠశాల



రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, తరగతి గది జ్ఞాపకాలు, స్నేహబంధాల మధురానుభూతులు ఒక్కొక్కరిగా గుర్తుచేసుకుంటూ నవ్వులు పూశాయి. కొంతమంది మిత్రులు చాలా కాలం తర్వాత కలుసుకోవడంతో పరస్పరం ఆలింగనం చేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులు తమ జీవిత ప్రయాణాలను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు శాలువాలు, జ్ఞాపికలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రూప్ ఫోటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఆత్మీయ సమ్మేళనం గురుశిష్య బంధానికి, స్నేహానికి చిరస్మరణీయ నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన సింగిరెడ్డి పద్మారెడ్డి



మేడిపల్లి మే 17(ప్రజాకలం న్యూస్) టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారికి బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి హార్దిక పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేష్ కుమార్ గౌడ్ దంపతులు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు ఆదర్శ దాంపత్య జీవితాన్ని కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న మహేష్ కుమార్ గౌడ్ విజయవంతంగా తన విదేశీ పర్యటన ముగించుకుని రావాలని ఆయన ఆకాంక్షించారు..

## చెరువులను కాపాడండి: ఆకుల సతీష్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని చెరువులను కాపాడాలని మాజీ బిజెపి అధ్యక్షుడు ఆకుల సతీష్ పేర్కొన్నారు. ఆదివారం బాచుపల్లి నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని 43 ఎకరాల పెద్ద చెరువు (భైరవ చెరువు)లో గత కొన్ని నెలలుగా డ్రైనేజ్ మురికి నీరు కలుస్తుండటంతో చెరువు కాలుష్యానికి



గురవుతోందని ఆకుల సతీష్ తెలిపారు. స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. పగిలిపోయిన 8 మ్యానువల్స్ను వెంటనే మరమ్మతు చేసి, మురికి నీరు చెరువులోకి రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువులోని చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించి చెరువును అభివృద్ధి చేయాలని స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు. నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే నిజాంపేట్ సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## జవహర్ నగర్ డబుల్ బెడ్ రూం ఫేజ్ 3 లో

# మంచినీటి కటకట

### త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

### తక్షణమే మంచినీటి సమస్యను తీర్చాలి - బ్లాక్ అధ్యక్షుడు సుధాకర్ నాయక్

మేడ్చల్ మే 17(ప్రజాకలం న్యూస్)

గత 15 రోజుల నుంచి జవహర్ నగర్ డబుల్ బెడ్ రూం ఫేజ్ 3 లబ్ధిదారులు త్రాగునీటికోసం పడరాని పాట్లు పడుతున్నారని, పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా,ఎస్టీపి పంపు హౌస్,పారిశుధ్య పనుల విషయంలో ప్రజా వాణిలో విన్నవించుకున్నా ఒక్క అధికారి కూడా పట్టించుకోకపోవడం శోచనీయం అని బ్లాక్ అధ్యక్షుడు సుధాకర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన గత కొన్నీ రోజుల నుంచి త్రాగునీటి కోసం ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



గత వారం రోజులుగా ప్రతి బ్లాక్ నుంచి రోజు రెండు నీళ్ళ ట్యాంకర్లు తెప్పించుకున్నా ఎవరికి సరిపోవడం లేదు.ఈ విషయంపై అధికారులకు విన్నవించుకున్న పలితం లేదని సుధాకర్ నాయక్ వివరించారు.ఇక్కడ మాకు పేరుకే ప్రభుత్వ ఇండ్లు కేటాయించారు కానీ ప్రైవేట్ అపార్ట్మెంట్లకంటే ఎక్కువ టాక్స్ లు కడుతున్నాము, విద్యుత్తు బిల్లులు కడుతున్నాము కానీ మాకు అటు ప్రభుత్వం నుంచి ఇటు అధికారులనుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని వాపోయారు.పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇక్కడ ఉన్న లబ్ధిదారులు ఉండడానికి ఇష్టపడక చాలా మంది వారి పూర్వ ప్రాంతానికి వేళ్ళడానికి ఇష్టపడుతున్నారు. మేము ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ స్థిరనివాసం ఏర్పరుచుకున్నా కనీసం ఎక్కడ వెళ్ళాలి అన్న కూడా సరైన రవాణా సౌకర్యం లేక కాలనీ వాసులు ఎక్కడ వెళ్లి పనిచేసుకోవాలో అర్థం కాక సతమౌతున్నారు.. మరి ముఖ్యంగా ప్రభుత్వం నిర్మించిన ఎస్టీపి పంప్ హౌస్ వల్ల వచ్చే దుర్వాసన వల్ల లబ్ధిదారులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. కనీసం దోమలను నివారించే పరిస్థితి కూడా లేకుండా పోయింది.. దానితో పాటు గంజాయి బ్యాచ్ తోడయింది. మరీ ముఖ్యంగా ఇక్కడ ఉన్న మహిళలకు రక్షణ లేకుండా పోయింది.పోలీసు అధికారులకు కాలనీ సంక్షేమ సభ్యులు ఎన్నిసార్లు చెప్పినా కనీసం కాలనీకి కూడా రావడం లేదు. విచ్చలవిడిగా గంజాయి సేవిస్తూ వచ్చి పోయేవారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా ప్రభుత్వానికి,ప్రభుత్వ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. దయచేసి ఇప్పటికైనా ప్రభుత్వం అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీ వాసులకు త్రాగునీటి విషయంలో శాశ్వత పరిష్కారం చూపించి వారికి అండగా నిలవాలని, వారికి భరోసా ఇవ్వాలని ఒక్క బ్లాక్ కి ప్రభుత్వమే ఒక్కోటి చొప్పున బోర్లు వేయించి నీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని సుధాకర్ నాయక్ డిమాండ్ చేశారు. లేని యెడల రాబోయే రోజుల్లో కాలనీ వాసులను తీసుకొని రిలే నిరహార దీక్షలు చేపడతామని సుధాకర్ నాయక్ హెచ్చారించారు.

# యదేచ్ఛగా అనుమతులేని భవన నిర్మాణాలు

- నిబంధనలు బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాల జాతర
- రామిరెడ్డి నగర్ పారిశ్రామికవాడలో కమర్షియల్ అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు
- అధికారుల అండదండలు వరుస అక్రమ నిర్మాణాలు జోరు
- అధికారుల సిబ్బంది నిర్వాహకంతో కొంపల్లి మున్సిపల్ ఆదాయానికి భారీ గండి



ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం(సిఎంసి) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కొంపల్లి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. కొంపల్లి సర్కిల్ పరిధిలోని కొంపల్లి, దూలపల్లి, సుభాష్ నగర్, సాయిబాబా నగర్, డివిజన్లో పలు ప్రాంతాల్లో కేవలం పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల సిబ్బంది తీరుతెన్నుల నిర్వాహకం వల్లనే అనేక అక్రమ నిర్మాణాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. ఎలాంటి



అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలు (అనుమతి లేని భవనాలు నిర్మాణాలు కొనసాగిస్తున్నారు) ఇటీవల నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ సృజన ఎంతో కొంత మార్పు కోసం చేస్తున్నప్పటికీ ఎప్పటికప్పటికీ చర్యలు తీసుకోవలసిన అధికారులు, సిబ్బంది కొంపల్లి మున్సిపాలిటీ పాత పద్ధతులను అనుసరిస్తున్నారు. సిఎంసిగా మారిన గత పాత తరహాలోనే వారు అక్రమ నిర్మాణదారుల పట్ల ఉదాసీనతతో వ్యవహరించడం పరిపాటైపోయింది. సిఎంసిలో విలీనమై శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్న ప్రజల ఆకాంక్షకు టౌన్ ప్లానింగ్ విభాగం తూట్లు పొడుస్తున్నారని స్థానికుల ఆరోపించారు.

కొంపల్లి సర్కిల్లో అక్రమ నిర్మాణాల చేపట్టి కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్నారని స్థానికులు వాపోయారు.

కొంపల్లి సర్కిల్ లో ఎక్కడ చూసినా అనుమతులు లేని నిర్మాణాలే కనిపిస్తున్నాయి. అందుకే అధికారులు సిబ్బంది మౌనం ఆంతర్యం పట్ల బహిరంగంగానే ప్రజలే ముక్కు మీద వేలేసుకుంటున్నారు. అధికారులు అక్రమ నిర్మాణాల పట్ల కుమ్మకై సిఎంసి నిబంధనలకు త్రిలోదకాలు ఇస్తూ ఈ అక్రమ నిర్మాణాల కొనసాగింపేనని ఆరోపణలు వెలువడుతున్నాయి.

ఇప్పటికైనా పై అధికారులు ప్రజా ప్రయోజనాల కోసం కొంపల్లి అభివృద్ధి దృష్ట్యా సిఎంసి ఆదాయానికి గండి కొట్టే చర్యలపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకొని ప్రభుత్వాదాయాన్ని పెంచుకోవాలని సిటిజన్స్ సూచించారు. అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై, పై అధికారులు చర్యలు తీసుకొని కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. ఓవైపు అనుమతిలేని, నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించ పోమని ప్రభుత్వం చెపుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. అది సాధ్యం కావడం లేదని స్పష్టంగా అనుమతి లేని భవనాలను చూస్తే కనిపిస్తుంది.